క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షుడికి అభినందనలు



కృష్ణారావును అభినందిస్తున్న సత్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన అంబటి కృష్ణారావును విశాఖపట్నం మాజీ మేయర్ దాడి సత్యనారాయణ, పలువురు నాయకులు అభినందించారు. శనివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞానభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణారావు మాట్లాడుతూ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం రీజనల్ సెక్రటరీగా వెంకటరమణ



కేసీహెచ్ వెంకటరమణ

శ్రీకాకుళం అర్బన్: భారతీయ స్టేట్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం రీజనల్ సెక్రటరీగా కేసీహెచ్ వెంకటరమణ వరుసగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 20, 21 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కిష్టప్పపేటలో రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పల్లెపండుగలో భాగంగా శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ పూర్తి చేస్తామని చెప్పారు.

ముగిసిన ఆడిట్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)పై రాష్ట్ర ఏజీ కార్యాలయం విజయవాడ అధికారులు ఎం.రమణమూర్తి, అర్పిత్ జైన్‌లు నిర్వహించిన ఆడిట్ శనివారం ముగిసింది. ఐదు రోజులుగా జరిగిన ఈ ఆడిట్‌లో నేషనల్ పెన్షన్ స్కీం అకౌంట్‌లో జమచేసిన నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్సిటీలో తొమ్మిది మంది రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బంది సీపీఎస్ పరిధిలో ఉన్నారు. సీపీఎస్ ప్రక్రియ పూర్తిస్థాయిలో ఎందుకు అమలుచేయలేదని ఆడిట్ అధికారులు ప్రశ్నించారు. మార్చి 31నాటికి ఉద్యోగులకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు అందజేయాలని సూచించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆరోగ్యవంతమైన సమసమాజ నిర్మాణానికి బాటలు వేయాలని హయాతీనగరంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

రణస్థలం: ప్రజారక్షణే పోలీసుల లక్ష్యమని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పరిసరాలు, అధికారి విధులు, రైటర్, వైర్‌లెస్, కేసుల నమోదు, ట్రాఫిక్ నియంత్రణ, షీ టీమ్ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం

గార: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య కీలకమైనదని డీవీఈవో ఎస్.తవిటినాయుడు అన్నారు. శనివారం కళింగపట్నం కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యా ప్రగతి, సిలబస్, సౌకర్యాలపై ఆరా తీశారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.అప్పలరాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాటల మాంత్రికుడు!

- మిమిక్రీ, వెంట్రిలాక్విజంలో రాణిస్తున్న మిమిక్రీ శ్రీనివాస్
- అప్పడాల అమ్మకం నుంచి అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చేస్థాయికి..
- 15 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చినా నేటికీ సైకిల్‌పైనే సవారీ



అవార్డులు, జ్ఞాపికలతో మిమిక్రీ శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్: ఆయనో మాటల మాంత్రికుడు. చేతిలో ఉన్న బొమ్మతో మాట్లాడించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాడు. ముఖ్యంగా చిన్నారులను తన హాస్య చతురతతో మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాడు. చిరుద్యోగం చేస్తూ ఒక్కో మెట్టు పైకి ఎక్కుతూ నేడు దేశవిదేశాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చేస్థాయికి చేరుకున్నారు. ఆయనే శ్రీకాకుళం నగరానికి చెందిన వేదుల ప్రభాకర శ్రీనివాస్. అందరూ ముద్దుగా పిలుచుకునే మిమిక్రీ శ్రీనివాస్. ఆయన జీవిత ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ నుంచి మొదలు..

వేదుల సీతారామమూర్తి, మధుకేశ్వరమ్మల దంపతులకు తొమ్మిది మంది సంతానంలో శ్రీనివాస్ ఒకరు. ఈయన భార్య సీతారత్నం. వీరి కుమార్తె మణికంఠ వీణ. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ స్ఫూర్తితో 1982లో మిమిక్రీ సాధన ప్రారంభించారు. జాతీయ కళాకారుడు ఎల్.నందికేశ్వరరావు గురువుగా కళపై పట్టు సాధించారు. ఓవైపు కళా ప్రదర్శనలు ఇస్తూనే మరోవైపు జీవనోపాధి కోసం తొలిసారిగా మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగంలో చేరారు. 1991 నుంచి 1994 వరకు ఊరూరా మసాలా దినుసులు, అప్పడాలు అమ్మకం చేపట్టారు. తర్వాత నగరంలోని ప్రముఖ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో మేనేజర్‌గా పనిచేశారు.

1997 నుంచి ఇతర పనులు మానేసి పూర్తిగా మిమిక్రీ కళకే అంకితమయ్యారు. జిల్లాలో మొదటిగా మాట్లాడే బొమ్మ(వెంట్రిలాక్విజం) ప్రదర్శన మొదలు పెట్టారు. తొలిసారిగా ప్రభుత్వ స్కూళ్లలో చిన్నారులకు ఉచితంగా వినోదం కల్పించేందుకు ప్రదర్శనలు ఇచ్చేవారు. ఓ బిస్కెట్ కంపెనీ ప్రచారం కోసం 250 స్కూళ్లలో ప్రదర్శనలు ఇవ్వడంతో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇప్పటి వరకు 14 దేశాలలో మాట్లాడే బొమ్మ ప్రదర్శనలు ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతినార్జించారు.

బిరుదులు, సత్కారాలు..

శ్రీకాకుళం జూనియర్ చాంబర్ 'ధ్వని విశారద' బిరుదుతో సత్కరించగా..2012 పెరల్ జూబ్లి ఫంక్షన్‌లో 'మిమిక్రీ సామ్రాట్' బిరుదు, తాడేపల్లిగూడెంలో 'మిమిక్రీ కళాజ్యోతి' బిరుదులు అందుకున్నారు. 2002 మార్చి 12, 13 తేదీల్లో బాపూజీ కళామందిర్‌లో ఏకబిగిన 25 గంటల పాటు ప్రదర్శన ఇచ్చారు. అంతకుముందు 1999 అక్టోబరు 20, 21 తేదీల్లో ఎన్‌టీఆర్ ఎంహెచ్ స్కూల్లోని తిలక్ హాల్‌లో 12 గంటలు ప్రదర్శన ఇచ్చి ఆకట్టుకున్నారు.

ఎంతస్థాయికి ఎదిగినా..

మిమిక్రీ, వెంట్రిలాక్విజం ద్వారా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నా 38 ఏళ్లుగా నా ప్రయాణం సైకిల్‌పైనే. ఎక్కడికి వెళ్లాలన్నా సైకిలే నా నేస్తం. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మన కాళ్లు నేలపైన ఉంచుకోవాలనేదే నా అభిమతం. ప్రస్తుతం దైవ కార్యక్రమాలు, చిన్నారులను అలరించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

– మిమిక్రీ శ్రీనివాస్, మిమిక్రీ కళాకారుడు



ఆదిత్యుని సన్నిధిలో వాసుదేవానందగిరి స్వామీజీ



స్వామీజీకి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విజయవాడ పెద్దపులిపాకకు చెందిన వాసుదేవానందగిరి స్వామీజీ తన శిష్యబృందంతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు స్వామిజీకి స్వాగతం పలికి ప్రత్యేకంగా పూజలు చేయించారు. అనంతరం అనివెట్టి మండపంలో భక్తులనుద్దేశించి స్వామిజీ పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి సాందీప్‌శర్మ పాల్గొన్నారు.

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని విజయవాడ శ్రీవిద్యాపీఠం వ్యవస్థాపకులు వాసుదేవానంద స్వామి శనివారం దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి, లక్ష్మీసన్నిధి, వైష్ణవీదుర్గ, నృసింహస్వామిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో మౌలిక వసతులు

రణస్థలం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ బి.సుధాకరరావు తెలిపారు. రణస్థలం పంచాయతీ పిట్టపాలెం, వేల్పురాయి గ్రామాల్లో జరుగుతున్న సీసీ కాలువ పనులు, చిన లంకపేటలో సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పారదర్శకంగా, నాణ్యతతో పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసనాయుడు, ఈసీ గౌరీశంకర్, పీఆర్ జేఈ అప్పన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు, అధికారులు

ఓటర్లుగా నమోదుకావాలి



సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

శ్రీకాకుళం: యూనివర్సిటీ, కళాశాలల్లోని అధ్యాపకులు, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులంతా నవంబర్ 6వ తేదీలోగా ఓటర్లుగా నమోదు కావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్‌కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా, మండల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 మార్చిలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జరగనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎండ ఉమాశంకర్, శ్రీకాకుళం, గార, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండల నాయకులు సురేష్‌కుమార్, చిన్నారావు, త్రినాథరావు, మహేష్, ఎల్. శ్రీనివాస్, మురళీమోహన్, బి.రమణ, శ్యామ్, వాసుదేవరావు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర కళాశాలల క్రీడా పోటీల్లో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఈ నెల 23, 25వ తేదీల్లో మహిళలు, పురుషుల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో పురుషుల జట్టు ప్రథమ, వాలీబాల్ పోటీల్లో మహిళల జట్టు ద్వితీయ, పురుషుల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. ఆరుగురు క్రీడాకారులు అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. మరో ఇద్దరు మహిళల వాలీబాల్ జట్టుకు స్టాండ్‌బైగా చోటు దక్కించుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వ్యాయామోపాధ్యాయులు అరుగుల జ్యోతికుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి బైరి మోహన్, ఎంవీ సత్యనారాయణ, డాక్టర్ రోణంకి హరిత శనివారం అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్, పీడీలు, అధ్యాపకులు

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఐఎంసీ) చైర్మన్ ఎం.గోపాలరావు అన్నారు. బలగ హాస్పటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో 2023–24 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ పీవీ రఘునాథ్, డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్‌మోహన్‌రావు, శిక్షణాధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: అమరవీరుల సంస్మరణ స్మారక ఉత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం ఫంక్షన్ హాల్లో శనివారం పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రస్తుతం పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. స్మారక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వీరికి బహుమతులు అందజేస్తారు.

తొమ్మిది పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో బదిలీల తర్వాత తొమ్మిది పంచాయతీలకు రెగ్యులర్ గ్రామ క్యార్యదర్శులు లేరు. ఈ గ్రామాలకు ఇన్‌చార్జిలను నియమించినట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు శనివారం చెప్పారు. ధర్మవరం, ఎచ్చెర్ల, పొన్నాడ, చిలకపాలెం, ఫరీదుపేట, కొత్తపేట, కుప్పిలి, తోటపాలెం, కుశాలపురం గ్రామాలకు కార్యదర్శులను నియమించినట్లు చెప్పారు. సామాజిక పింఛన్ల పంపిణీ, పౌర సేవలు, గ్రామ ప్రగతిలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అభివృద్ధి ప్రణాళిక శిక్షణకు ఎంపీడీఓ

ఎచ్చెర్ల క్యాంపస్: సామర్లకోటలో సోమ, మంగళవారాల్లో జరగనున్న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అభివృద్ధి ప్రణాళిక శిక్షణకు ఎచ్చెర్ల ఎంపీడీఓ సీపాన హరిహరరావు హాజరుకానున్నారు. ఎంపిక చేసిన అధికారులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పరిశీలన

ఎచ్చెర్ల: లావేరు మండలంలో నూతనంగా మంజూరైన సాక్షం అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ బగాది శాంతిశ్రీ శుక్రవారం పరిశీలించారు. లావేరు-3, బొంతుపేట, గోవిందపురం అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో మాట్లాడి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రణస్థలం పీవో ఝాన్సీబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నైరాలో టూరిజం క్లబ్ ఏర్పాటు

శ్రీకాకుళం రూరల్: నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులతో శనివారం టూరిజం క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన క్షేత్రాలైన అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, శాలిహుండం తదితర ప్రదేశాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడి విశిష్టతను అధికారులు వివరించారు. కార్యక్రమంలో పర్యాటక అధికారి నారాయణరావు, అరసవల్లి డిప్యూటీ కమిషనర్ భద్రాజీ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా చెత్తసంపద కేంద్రం నిర్వహణ



కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ఐ.వి.రమణ

గార: చెత్త నుంచి సంపద కేంద్రాన్ని మరింత సమర్థంగా నిర్వహించాలని డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. శనివారం శ్రీకూర్మం పంచాయతీ కేంద్రాన్ని పరిశీలించారు. తడిచెత్త ద్వారా ఎరువును తయారు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ఎం.రాము, సెక్రటరీ రమణమ్మ ఉన్నారు.

రేషన్ బండి.. మూలకు చేరిందండి



తమ్మినాయుడుపేట, అల్లినగరం గ్రామాలకు రేషన్ సరుకులు అందజేసే వాహనం మూలకు చేరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనం ఆపరేటర్‌కు స్థానిక నాయకులతో సఖ్యత కుదరకపోవడంతో తహశీల్దార్ కార్యాలయానికి బండిని అప్పగించి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి డిపో వద్దనే వీఆర్వోలు రేషన్ సరుకులు ఇస్తున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

నిలువెల్లా నిర్లక్ష్యం



ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బ్లాక్, వసతి గృహం బ్లాక్‌ల వెనుక వైపు భవనాల్లో రావి, మర్రి వంటి మొక్కలు పెద్దవిగా పెరిగి గోడలు బీటలుగా మారుతున్నాయి. ప్రారంభంలో మొక్కలు తొలగించటం, కెమికల్స్ వినియోగించి శుభ్రం చేయకపోతే భవనం గోడలు పాడయ్యే అవకాశముందని పలువురు చెబుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

నిర్వహణ గాలికొదిలేశారు



చెత్తద్వారా సంపద సృష్టించి పల్లెలను అభివృద్ధి చేస్తామని నాయకులు, అధికారులు చెప్పడమే తప్ప కార్యాచరణ అమలు చేయడం లేదు. ఎస్.పి. ఆర్.పురంలో చెత్త కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు పేరుకుపోయి అధ్వానంగా మారింది. నిర్వహణ గాలికొదిలేయడంతో అస్తవ్యస్తంగా తయారైంది.

- జి.సిగడాం

ఎక్కడి లారీలు అక్కడే..



ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ నుంచి పాత జాతీయ రహదారి వరకు మద్యం లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ఖాళీగా లేకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఏ రోజు వాహనాలు ఆ రోజు అన్‌లోడ్ చేస్తే సమస్య ఉండదు. జాప్యం జరగడంతో రోడ్డుపై ట్రాఫిక్ సమస్య సైతం తలెత్తుతోంది.

- ఎచ్చెర్ల క్యాంపస్

ప్రజాదర్బార్‌లో వసతుల లేమి



వినతులు స్వీకరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ప్రజాదర్బార్‌లో కనీస వసతులు కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినతుల స్వీకరించేందుకు గంటలకొద్ది క్యూలైన్లలో నిలబెట్టడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ఈ నెల 4న ప్రజాదర్బార్ నిర్వహించి 1నుంచి 25వ డివిజన్ల వరకు వినతులు స్వీకరించారు. తాజాగా శనివారం 26నుంచి 50 డివిజన్ల పరిధిలోని వినతులు స్వీకరించారు. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని మళ్లీ రావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వసతులు లేక ఎండలో నిలబడలేక నరకయాతన అనుభవించారు. ఇటువంటి ప్రజాదర్బార్‌లను నిర్వహిస్తే బహిరంగ ప్రదేశాలైన ఆర్ట్స్‌కాలేజీ గ్రౌండ్, మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లలో నిర్వహిస్తే ఇబ్బంది పడ్డాల్సిన అవసరం ఉండదని నగరవాసులు చెబుతున్నారు. కాగా, శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 336 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీ స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్లకు హైస్కిల్ వేజెస్ మంజూరు చేయాలని, ప్రతి నెలా 10వ తేదిలోపు జీతాలు చెల్లించాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజులు మాట్లాడుతూ కార్మికులకు యూనిఫామ్, కాస్మోటిక్స్ ఇవ్వాలని, వారాంతపు సెలవు పండుగ సెలవులు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐలో ఉన్న సాంకేతిక లోపాలు సరిచేసి ఖాతాల్లో డబ్బు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కె.వేణుగోపాల్, బలగ తేజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న అనుపోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నందెన్న ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నందెన్న, గౌరీదేవిలను నక్కవీధి, దేశెల్లవీధి, మావూరువీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, బి.అశ్వినికుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నందెన్నను ఊరేగిస్తున్న భక్తులు

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- 30 రోజుల జైలు శిక్ష

శ్రీకాకుళం క్రైమ్: కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఎస్సీ వీధికి చెందిన లోపింటి నిరంజన్‌భాస్కర్ మద్యం తాగి 80 ఫీట్ రోడ్డులో వచ్చేపోయేవారిని అల్లరి చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం బస్సు దిగిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థిపై ఇలానే ప్రవర్తించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. బెంచ్‌కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చడంతో 30 రోజుల జైలు శిక్ష విధించారని శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. నిరంజన్ భాస్కర్‌పై ఇప్పటికే సస్పెక్ట్ షీట్ ఉందని, ఎన్డీపీఎస్ కేసు, రెండు దొంగతనం కేసులు సైతం ఉన్నాయని వెల్లడించారు.

ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక

అరసవల్లి: ఏపీ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ (1104) శ్రీకాకుళం బ్రాంచ్ అధ్యక్షుడిగా నారాయణరావు, కార్యదర్శిగా టీవీ సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా ఆర్.రాజేంద్ర ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన ఈ ఎన్నికలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ గోపాలరావు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణపై మార్గదర్శకం చేశారు.



నూతన కార్యవర్గంతో గోపాలరావు